సాక్షి
ఏలూరు
మంగళవారం । 18 । మార్చి । 2025



గిట్టుబాటు ధర ఇవ్వాలి

కోకోకు గిట్టుబాటు ధర కల్పించాలని కోకో రైతుల సంఘం డిమాండ్ చేసింది. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సంఘ సభ్యులు డైరెక్టర్‌కు అందజేశారు. 8లో ▸



హుండీ ఆదాయం రూ.1.75 కోట్లు

ద్వారకాతిరుమల చినవెంకన్న హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 18 రోజులకు రూ.1.75 కోట్ల ఆదాయం లభించింది. 8లో ▸



రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం (సాయంత్రం)	సహరి బుధవారం (ఉదయం)
ఏలూరు	6.21	4.47
జంగారెడ్డిగూడెం	6.19	4.43
నూజివీడు	6.32	5.00

న్యూస్‌రీల్

గిరిజనుడిపై దాడి దారుణం



బాధితుడు యాకోబును పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

బుట్టాయగూడెం: ఇటీవల గుళ్లపూడికి చెందిన మడకం యాకోబు అనే గిరిజనుడిపై దాడి చేసిన ఫారెస్ట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం ఏరియా ఆస్పత్రిలో వైద్యం పొందుతున్న యాకోబును పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నామన్నారు. అలాగే అతడి వైద్యానికి ఆర్థిక సహాయం కూడా చేసినట్లు చెప్పారు. యాకోబుపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, తప్పు చేసినట్టు రుజువైతే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి గాని చిత్ర హింసలు పెట్టడం సరికాదన్నారు. ఫారెస్ట్ అధికారుల దాడిలో యాకోబు పక్కటెముకలు విరిగాయన్నారు. ఈ సంఘటనకు బాధ్యులైన సబ్ డీఎఫ్‌ఓ, ఇతర అధికారులపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. విషయాన్ని డీఎస్పీ దృష్టికి కూడా తాను తీసుకువెళ్లానని, బాధితుడికి న్యాయం జరిగే వరకూ అండగా ఉంటానని బాలరాజు తెలిపారు. వైస్ ఎంపీపీ గగ్గులోతు మోహన్‌రావు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ నేత సోడెం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్ద వాగు మరమ్మతులకు కృషి



రైతులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్

వేలేరుపాడు: తెలంగాణలోని పెద్దవాగు ప్రాజెక్ట్ మరమ్మతుల విషయంలో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడి 15 రోజుల్లో ఓ కొలిక్కి తెస్తామని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. సోమవారం అశ్వారావుపేట మండలం గుమ్మడవల్లిలో పెద్దవాగు ప్రాజెక్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వేలేరుపాడు, కుక్కునూరు మండలాల ఆయకట్టు రైతులతో ఆయన మాట్లాడారు. ప్రాజెక్ట్ వ్యవహారంపై తక్షణమే తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సీఎస్‌లకు నోటీసులు జారీ చేసి ఢిల్లీకి రప్పిస్తానన్నారు. ఏలూరు జిల్లా కలెక్టర్లతోపాటు ఇరిగేషన్ ఎస్ఈలను అక్కడికే పిలిచి ఉమ్మడి సమావేశాన్ని ఏర్పాటు చేసి పెదవాగు ప్రాజెక్టు సమస్యను పరిష్కరించేలా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గండ్లు పడిన పెద్దవాగు ప్రాజెక్టు ప్రధాన ఆనకట్టను పరిశీలించి ఆయకట్టు రైతులతో మాట్లాడి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

తెలుగును ఐచ్ఛికం చేయొద్దు



ప్రాంతీయ పర్యవేక్షణాధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న అధ్యాపకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియెట్ విద్యలో సంస్కరణల్లో భాగంగా ద్వితీయ భాష తెలుగును ఐచ్ఛిక సబ్జెక్టుగా మార్చేందుకు చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని ఆంధ్రప్రదేశ్ తెలుగు అధ్యాపకుల సంఘం నాయకులు ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహానుకు వినతిపత్రం సమర్పించారు. సోమవారం స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ప్రారంభమైన ఇంటర్ మూల్యాంకనం సందర్భంగా వినతిపత్రాన్ని సమర్పించారు. తెలుగును ఐచ్ఛికం చేయడం వల్ల భాష మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీబీ రాజేష్ కుమార్, టి.ప్రేమ్‌కుమార్, కృష్ణంరాజు, కనకదుర్గ తదితరులు ఉన్నారు.

అపరాల కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ఏలూరు(మెట్రో): ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మద్దతు ధరతో మినుములు, పెసలు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్టు జేసీ పి.ధాత్రిరెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. పెదపాడు, వట్లూరు, డీసీఎంఎస్ ఏలూరు, జాలిపూడి, దెందులూరు సొసైటీల్లో పెసలు కొనుగోలు కేంద్రాలు, లింగాల, దేవపూడి, తామరకొల్లు, డీసీఎంఎస్ ఏలూరు, దెందులూరు, డీసీఎంఎస్ అప్పన్నవీడు, పెదపాడు, వెంకటాపురం సొసైటీల్లో మినుము కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు.

పొలం ఆక్రమించుకున్నారంటూ..



జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడేనికి చెందిన భూలక్ష్మి తనకున్న కొద్ది పొలం ఆక్రమణకు గురైందంటూ, అక్రమంగా రికార్డులు మార్చారంటూ తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ఏడాదిన్నరగా తిరుగుతూనే ఉంది. అయితే అధికారులు పట్టించుకోకపోగా వేరేవారికి కట్టబెట్టడంతో ఏలూరు కలెక్టరేట్‌కు వచ్చింది. తన సమస్యను పరిష్కరించాలని, తమ పొలానికి మార్గం చూపాలంటూ కన్నీటి పర్యంతమైంది.

పింఛన్ కోసం వేడుకుంటూ..



చాట్రాయి మండలం ముంకొల్లుకి చెందిన పేరిబోయిన అచ్చమ్మ తన భర్తను కోల్పోయి ఆదరించే వారు లేక తీవ్ర ఇబ్బందులు పడుతోంది. వితంతు పింఛన్ కోసం ఏడాదిగా అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉంది. అయినా ఆమెకు పింఛన్ మంజూరు కాలేదు. గ్రామ, మండల స్థాయి అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకపోవడంతో ఏలూరు కలెక్టరేట్‌కు వచ్చింది. తనను ఆదరించేవారు లేరని పింఛన్ ఇప్పించాలని అర్జీ ఇచ్చింది.

ఏడాదిగా తిరుగుతూ..



జంగారెడ్డిగూడానికి చెందిన చిట్లూరి రామారావు పూర్తిగా దివ్యాంగుడు. కర్ర సాయంతో, మరో వ్యక్తి సాయంతోనే నడుస్తున్నాడు. గత ఏడాది కాలంగా దివ్యాంగుల పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నా ఇప్పటికీ మంజూరు కాలేదు. కనీసం ఏ అధికారి కూడా తనను పట్టించుకోవడం లేదంటూ, ఏలూరు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చాడు. తన సమస్యను పరిష్కరించాలంటూ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశాడు.

శ్మశాన వాటికకు స్థలం కోసం..



ఏలూరులో క్రైస్తవుల శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ వర్కింగ్ కమిటీ ప్రతినిధులు పమ్మి శ్యామ్ పాలిన, ఎం.పౌలు రాజు, బి.యోహాను కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. 1970లో క్రైస్తవుల కోసం సమాధుల తోట కేటాయించగా జనాభా పెరగడంతో సరిపోవడం లేదని, చొదిమెళ్ల వద్ద తమ్మిలేరు ఏటిగట్టుపై స్థలం కేటాయించాలని కోరారు.

పీఎఫ్ సొమ్ములో వాటా కోసం..



పెదవేగికి చెందిన దాసరి ముత్తయ్య అనే వృద్ధుడు తన కుమారుడికి వచ్చే పీఎఫ్ సొమ్ములో వాటా ఇప్పించాలని కోరాడు. కోడలు వేధింపులతో తన పెద్ద కుమారుడు ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తూ ఆత్మహత్య చేసుకున్నాడని, తాను నామినీగా ఉన్నానని అన్నాడు. పుళ్లలో మహిళా పోలీసుగా పనిచేస్తున్న తన కోడలు పీఎఫ్ సొమ్ములో తనకు వాటా రాకుండా కుట్రలు చేస్తోందని, న్యాయం చేయాలని కోరాడు.

పరిష్కార వేదిక.. సమస్యలు తీర్చలేక!

సాక్షి నెట్‌వర్క్



తన కుమారులు చూడటం లేదంటూ రోదిస్తున్న అమ్మపాలేనికి చెందిన వెంకటాయమ్మ



ఏలూరు కలెక్టరేట్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ వెట్రిసెల్వి

- ప్రతి వారం వినతుల వెల్లువ
- పరిష్కారానికి నోచుకోని ఫిర్యాదులు
- పేరు మార్పుతో సరిపెట్టిన కూటమి ప్రభుత్వం
- పింఛన్, భూసమస్యలపై ఎక్కువగా దరఖాస్తులు

ఏలూరు(మెట్రో)/ ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సమస్యల పరిష్కారంలో విఫలమైంది. సమస్యలు పట్టి పీడిస్తున్నా పరిష్కరించే నాథుడే కరువయ్యాడు. కూటమి ప్రభుత్వం కార్యక్రమం పేరు మార్చడంలో చూపిన శ్రద్ధ సమస్యల పరిష్కారంలో చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం ఫిర్యాదుల స్వీకరణపైనే దృష్టి సారించిన కూటమి సర్కారు సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో పర్యటనలు, సమీక్షా సమావేశాల నిర్వహణలో చూపడం లేదు. దీంతో ఫిర్యాదుల పరిష్కారం కోసం అర్జీదారులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

సోమవారం.. సమస్యలు అనేకం

ప్రతి సోమవారం బాహాటంగా నిర్వహిస్తున్న పరిష్కార వేదికకు అర్జీలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద జరిగిన కార్యక్రమానికి 318 ఫిర్యాదులు వచ్చాయంటే సమస్యల తీవ్రత అర్థం చేసుకోవచ్చు.

సచివాలయాల నిర్వీర్యంతో..

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామస్థాయిలోనే సమస్యలు పరిష్కారమయ్యాయి. అయితే కూటమి ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణితో సచివాలయాల వద్దకు వెళ్లేందుకు ప్రజలు విముఖత చూపుతున్నారు. సచివాలయాలను నిర్వీర్యం చేసేలా ప్రభుత్వం ఉద్యోగులపై భారం మోపడంతో పాటు ఫిర్యాదుల స్వీకరణకు ఏర్పాట్లు చేయడం లేదు.

మూడు నెలల్లో 1,845 ఫిర్యాదులు

జిల్లావ్యాప్తంగా గత మూడు నెలల్లో 1,845 ఫిర్యాదులు రాగా 712 అర్జీలు పరిష్కారానికి నోచుకోలేదు. 1,125 అర్జీలను పరిష్కరించామని అధికారులు చెబుతున్నా అవి కూడా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదనే వాదన వినిపిస్తోంది.

318 అర్జీలు : ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన పీజీఆర్‌కు ప్రజలు పోటెత్తారు. జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, ఆర్డీఓ అచ్యుత అంబరీష్, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కర్‌తో కలిసి కలెక్టర్ వెట్రిసెల్వి అర్జీలు స్వీకరించారు. మొత్తంగా 318 అర్జీలు స్వీకరించినట్టు కలెక్టర్ తెలిపారు.

విలపింఛెన్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రెండు కాళ్లు పూర్తిగా చచ్చుపడిపోయాయి 10 నెలల నుంచి పెన్షన్ కోసం కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు ఇదొక దివ్యాంగుడి ఆవేదన.. కొత్త పెన్షన్లు ఏమో గాని ఉన్న పెన్షన్లు ఎందుకు తీసేశారో తెలియడం లేదు.. న్యాయం చేస్తారని ఇక్కడికి వచ్చా ఇదొక వృద్ధురాలి వేదన.. ఇలా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే పీజీఆర్ఎస్‌కు వచ్చే వినతుల్లో ఎక్కువ శాతం పింఛన్ దరఖాస్తులే ఉంటున్నాయి. సోమవారం 'సాక్షి' బృందం ఏలూరు కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను క్షేత్రస్థాయిలో పరిశీలించింది. ఎక్కువ మంది పెన్షన్‌తో పాటు భూసంబంధిత సమస్యలపై అర్జీలు అందించారు. రెండు నెలలుగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌తో నిలిచిపోయిన ఈ కార్యక్రమం రెండు వారాల నుంచి యథావిధిగా జరుగుతోంది.



గ్యాలరీలో కూర్చొన్న ఫిర్యాదుదారులు



ఏలూరు కలెక్టరేట్‌లో అర్జీలు అందించేందుకు క్యూ కట్టిన దృశ్యం

ప్రశాంతంగా పది పరీక్షలు



ఏలూరులో కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి



ఏలూరు సెయింట్ థెరిస్సా కాన్వెంట్ వద్ద..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. సోమవారం జరిగిన తెలుగు పరీక్షకు 25,179 మంది విద్యార్థులకు 23,064 మంది హాజరయ్యారు. 91.60 శాతం హాజరు నమోదైంది. ఏలూరు అశోక్‌నగర్‌లోని కేపీడీటీ నగరపాలక ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీ చేశారు. పకడ్బందీగా నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన తాగునీరు, ఇతర వసతులను, వైద్య శిబిరాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ పరీక్షలో ఎటువంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని చెప్పారు. పరీక్షా కేంద్రాల తనిఖీలో భాగంగా ఫ్లయింగ్ స్క్వాడ్లు 54 పరీక్షా కేంద్రాలను, డిస్ట్రిక్ట్ లెవెల్ అబ్జర్వర్ 9 కేంద్రాలు, తాను 6 కేంద్రాలు, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ 4 కేంద్రాలను తనిఖీ చేసినట్టు చెప్పారు.

ఇంటర్ బ్రిడ్జి కోర్సు పరీక్షలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని 15 కేంద్రాల్లో సోమవారం ఇంటర్మీడియెట్ బ్రిడ్జి కోర్సు థియరీ పరీక్షలకు 1,245 మంది హాజరయ్యారు. 1,733 మంది ఒకేషనల్ విద్యార్థులకు 498 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాను తెలిపారు.

బెదిరించి.. లైంగిక దాడికి పాల్పడి..

- వివాహితపై ఇద్దరు వ్యక్తుల ఘాతుకం
- నగ్న వీడియోలు చూపుతూ బ్లాక్‌మెయిల్
- బాధితురాలు ఫిర్యాదు చేసినా పట్టని పోలీసులు
- ఏలూరు రేంజ్ ఐజీని కలిసిన బాధితురాలు, కుటుంబసభ్యులు



ఏలూరులో నిరసన తెలుపుతున్న బాధిత మహిళ, కుటుంబ సభ్యులు

ఏలూరు (టూటౌన్): తనను బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడంతో పాటు తనను నగ్నంగా వీడియోలు తీసిన ఇద్దరు వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ ఓ వివాహిత కుటుంబ సభ్యులతో కలిసి ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేసింది. పోలీసులను ఆశ్రయించినా కనీసం పట్టించుకోవడం లేదని, పైగా రాజీకి రావాలని, లేదంటే కౌంటర్ కేసు పెడతామని పోలీసులే బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో తనకు, తన కుటుంబసభ్యులకు రక్షణ కల్పించాలంటూ ఐజీని కలిసినట్టు చెప్పింది. బాధితురాలు, ఆమె బంధువులు స్థానిక ఏటిగట్టు వద్ద ఉన్న జిల్లా రజక సంఘం కార్యాలయంలో సోమవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం ఎన్ఆర్‌పీ అగ్రహారం గ్రామానికి చెందిన ఓ వివాహితపై అదే ప్రాంతానికి చెందిన యర్రంశెట్టి రవి, అతని స్నేహితుడు గుబ్బల సోమేశ్వరరావు అలియాస్ సోము అనుచితంగా ప్రవర్తించారు. ఆమెను బలవంతంగా లోబర్చుకోవాలని ప్రయత్నించారు. మాట వినకపోతే ఆమె భర్తను, కుటుంబాన్ని చంపేస్తామని బెదిరించారు. ఈ క్రమంలో వివాహితను బలవంతంగా గదిలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డారు. ఆ సమయంలో ఆమెకు మత్తు మందు ఇచ్చి నగ్నంగా వీడియోలు తీసి బ్లాక్ మెయిల్ చేశారు. ఈ క్రమంలో బీచ్‌కు, భీమవరంలోని స్నేహితుల గదికి తీసుకువెళ్లి పలుమార్లు లైంగిక దాడికి తెగబడ్డారు. అలాగే ఆమెను బెదిరించి పలు దఫాలుగా ఆమె నుంచి రూ.2.50 లక్షలు తీసుకుని మళ్లీ డబ్బులు కావాలంటూ వేధిస్తున్నారు.

రాజీ చేసుకోవాలని పోలీసుల ఒత్తిడి

తనకు జరిగిన అన్యాయంపై బాధితురాలు ఉండి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే పోలీసులు పట్టించుకోకపోగా నిందితుల పక్షాన కొమ్ము కాశారంటూ బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. కేసును వెనక్కి తీసుకోకపోతే తన భర్తపై, భర్త సోదరునిపై కౌంటర్ రేప్ కేసు పెడతామని, రాజీ చేసుకోవాలని పోలీసులే బెదిరిస్తున్నారని ఆమె వాపోయింది. ఈ విషయంపై పలుమార్లు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లినా న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ క్రమంలో బాధితురాలు, ఆమె కుటుంబ సభ్యులు రాష్ట్ర రజక సంఘం ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్యతో కలిసి ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. దీనిపై ఐజీ అశోక్‌కుమార్ స్పందించారని, పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీని విచారణ అధికారిగా నియమించారని, తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని కట్లయ్య తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.మురళీకృష్ణ, యలమంచిలి శేషు, బుద్ధవరపు గోపి, యండమూరి వీర్రాజు పాల్గొన్నారు.

మిన్నంటిన నిరసనలు



ఏలూరులో డీఎం కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఆరోగ్య మిత్రలు



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న స్కూల్ స్వీపర్లు

ఏలూరు (టూటౌన్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎన్‌టీఆర్ వైద్య సేవ ఆరోగ్య మిత్రలు సోమవారం నిరసన తెలిపారు. జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని ఆరోగ్యమిత్ర డీఎం కార్యాలయం ఎదుట నిరసన తెలిపి జిల్లా సమన్వయకర్తకు వినతి పత్రం అందజేశారు. శాంతియుతంగా విధుల బహిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.

చేనేతలను ఆదుకోవాలని..

రాష్ట్ర బడ్జెట్‌లో చేనేత రంగానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు.

కౌలు రైతుల సమస్యలపై : కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగ నియామకాలు చేపట్టాలి

కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ప్రభుత్వ ఉద్యోగాలైనా ఇవ్వండి లేదా నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి అయిన అమలు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) డిమాండ్ చేసింది. కలెక్టరేట్ వద్ద ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

గళమెత్తిన స్కూల్ స్వీపర్లు

స్కూల్ స్వీపర్లు, స్కూల్ శానిటేషన్ వర్కర్లకు జీఓ నం.7 ప్రకారం కనీస వేతనం రూ.15 వేలు ఇవ్వాలని, ప్రతి నెలా సకాలంలో జీతాలు ఇవ్వాలని, స్కూల్ స్వీపర్లకు యూనిఫాం, గ్రూప్ ఇన్సూరెన్స్, పీఎఫ్, ఈఎస్ అమలు చేయాలని కోరుతూ స్కూల్ శానిటేషన్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఏలూరు, వేలూరుపాడు, ముదినేపల్లి, పెదపాడు మండలాలకు చెందిన స్కూల్ స్వీపర్లు, స్కూల్ శానిటేషన్ వర్కర్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు

దెందులూరు: భువనేశ్వర్ వెళుతున్న కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో మంటలు చెలరేగాయి. దెందులూరు మండలంలోని సీతంపేట రైల్వే ట్రాక్ సమీపంలో సోమవారం ఈ ఘటన జరిగింది. రైలు ఇంజన్ నుంచి మూడో బోగీ చక్రాల వద్ద మంటలు వ్యాపించాయి. దీనిని గుర్తించిన రైలు సిబ్బంది వెంటనే రైలును నిలిపివేసి మంటలను ఆర్పేశారు. అనంతరం రైలు యథావిధిగా ముందుకు సాగిపోయింది. ఈ ఘటనపై రైల్వే ఎస్సై సైమన్ మాట్లాడుతూ వేసవిలో ఇలా జరగటం సర్వసాధారణమని చెప్పారు. అధిక ఎండల వల్ల బ్రేక్ షూస్‌లో స్వల్ప మరమ్మతులు వచ్చే అవకాశముందని తెలిపారు.

ట్రిపుల్ ఐటీలో 22, 23 తేదీల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీలో విద్యనభ్యసించిన 2008 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహిస్తున్నట్టు డైరెక్టర్ ఆచార్య సంద్ర అమరేంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎటెర్నాక్స్ పేరుతో నిర్వహించనున్న కార్యక్రమంలో పూర్వ విద్యార్థులందరూ పాల్గొని తమ గత అనుభవాలు, ప్రస్తుతం చేస్తున్న ఉద్యోగం, ఇతర వృత్తులు తదితర వాటిని ప్రస్తుత విద్యార్థులతో పంచుకోవాలని కోరారు. 2008 బ్యాచ్ విద్యార్థులందరూ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

పిచ్చికుక్క స్వైర విహారం

లింగపాలెం: లింగపాలెం మండలం యడవల్లిలో పిచ్చికుక్క స్వైరవిహారం చేస్తూ ముగ్గురు చిన్న పిల్లలను కరిచిందని యడవల్లి గ్రామస్తులు తెలిపారు. జనం బయటకు రావాలంటే ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని తిరగాల్సి వస్తోందన్నారు. గ్రామంలో కుక్కలు గుంపులుగా వీధులలో తిరుగుతూ.. ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు.

మహిళల మంగళ సూత్రాలు చోరీ

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రామచంద్రాపురంలో కోదండ రామాలయ పునః ప్రతిష్ట కార్యక్రమంలో ఆరుగురు మహిళల మంగళ సూత్రాలు చోరీకి గురయ్యాయి. పూజా కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, సందట్లో సడేమియా అంటూ గుర్తు తెలియని వ్యక్తులు తమ చేతివాటం చూపారు. మహిళంతా గుంపుగా ఉన్న చోటే ఈ చోరీలు జరగడం గమనార్హం. చోరీలకు పాల్పడింది పురుషులా లేక మహిళలా దొంగలా అనేది తెలియాల్సి ఉంది. పునః ప్రతిష్ట కార్యక్రమంలో భాగంగా ఆలయ శిఖరంపై నుంచి సంప్రదాయబద్ధంగా బూరెలు పోస్తున్నారు. బూరెలను గుంపుగా ఓ చోట చేసి తమ చీర కొంగుతో పట్టుకుంటున్నారు. ఆ సమయంలో మంగళసూత్రాలు చోరీకి గురయ్యాయి. బాధితుల్లో రాజమండ్రి రత్నకుమారికి చెందిన నానుతాడు, సూత్రాలు సుమారు 3 కాసులు, అల్లాడ లక్ష్మికి చెందిన మంగళసూత్రాలు ఒక కాసు, సాయిల లక్ష్మికి చెందిన ఒక మంగళసూత్రం, తానింకి విజయకుమారికి చెందిన సూత్రాలు ఒక కాసు, తలారి రత్నకుమారికి చెందిన సూత్రాలు ఒక కాసు, మరో మహిళకు చెందిన సూత్రాలు దోచుకున్నారు. జంగారెడ్డిగూడెం సీఐ జి.కృష్ణబాబు, ఎస్సై షేక్‌జబీర్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు.

20న విజయరాయిలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 20న ఉదయం 10 గంటలకు పెదవేగి మండలం విజయరాయిలో కోకో రైతుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. సోమవారం సీఐటీయూ కార్యాలయంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు సోమవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ నెల 20న పెదవేగి మండలం విజయరాయి, గాంధీనగర్ సీతారామ కళ్యాణమండపంలో కోకో రైతుల రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. సదస్సుకు రైతు సంఘాల రాష్ట్ర నాయకులు, ఏలూరు జిల్లాతో పాటు కోకో సాగు జరుగుతున్న జిల్లాల నుంచి కోకో రైతులను ఆహ్వానిస్తున్నామని వివరించారు.

సాయం చేసేవారు లేక..



తండ్రిని రక్త పరీక్షకు తీసుకువెళ్తూ..

ఏలూరు ప్రభుత్వాసుపత్రికి వెళ్లే రోగుల బాధలు అన్నీ ఇన్నీ కావు. నడవలేని రోగులను సహాయకులు వీల్‌చైర్‌పై స్కానింగ్‌కు, రక్తపరీక్షకు, ఎక్స్‌రేకు, ఫిజియోథెరపీకి తీసుకువెళ్లాల్సి ఉంటుంది. అయితే ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సిబ్బంది ఎవరూ స్పందించరు. బోలెడన్ని పనులున్నాయ్ మీరే తీసుకువెళ్లాలంటూ చిరాకుగా సమాధానాలు చెబుతారు. చేసేదేం లేక తామే తీసుకువెళ్తున్నామని రోగుల కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఆసుపత్రిలో పురుష, స్త్రీ సహాయకులుగా సుమారు 35 మంది ఉండేవారని ఇప్పుడు కేవలం 12 మందికే పరిమితమయ్యారని ఆసుపత్రి వర్గాలు చెబుతున్నాయి. సోమవారం ఏలూరు జీజీహెచ్‌లో కనిపించిన దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



నడవ లేని స్థితిలో వస్తే కనిపించని వీల్ చైర్



తమ్ముడిని ఎక్స్‌రేకు తీసుకువెళ్తున్న అన్న



ఫిజియోథెరపీకి నాన్నను తీసుకువెళ్తూ..



నడవలేని పరిస్థితిలో..

కోకోకు గిట్టుబాటు ధర ఇవ్వాలి

ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలి

సాక్షి, అమరావతి: కోకో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోకో రైతుల సంఘం డిమాండ్ చేసింది. గతంలో ఎన్నడూ లేనంత తక్కువ ధరకు కంపెనీలు కొనుగోలు చేయడం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేశారు. కోకో గింజల కొనుగోలు కంపెనీలు, కోకో రైతుల సంఘాల ప్రతినిధులతో సోమవారం గుంటూరులోని ఉద్యాన శాఖ కార్యాలయంలో జరిగిన సమీక్షలో కంపెనీల మాయాజాలం వలన తాము ఏవిధంగా నష్టపోతున్నామో పలువురు కోకో రైతులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఏపీ కోకో రైతు సంఘం ప్రతినిధులు ఎస్.గోపాలకృష్ణ, బొల్లు రామకృష్ణ, కోనేరు సతీష్ బాబు, గుదిబండి వీరారెడ్డి తదితరులు మాట్లాడుతూ.. అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజలకు కిలో రూ.700కు పైగా పలుకుతుండగా, రాష్ట్రంలో కంపెనీలు మాత్రం కిలో రూ.550–600కు మించి చెల్లించడం లేదన్నారు. గ్రేడింగ్ పేరిట అడ్డగోలుగా ధర తగ్గించడం వల్ల రైతులు నష్టపోతున్నారని చెప్పారు. వర్షాకాలపు పంట(అన్ సీజన్) కోకో గింజలను కంపెనీలు కొనుగోలు చేయడం లేదని, ఫలితంగా రైతులు వద్ద పెద్ద ఎత్తున నిల్వలు పేరుకుపోవడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చి సీజన్, అన్ సీజన్ కోకో గింజలను తక్షణమే కొనుగోలు చేయాలన్నారు. కంపెనీలు తగిన ధర ఇవ్వకపోతే వ్యత్యాసపు ధరను రాష్ట్ర ప్రభుత్వం కోకో రైతులకు చెల్లించేలా చర్యలు తీసుకుని కోకో రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు ధరల స్థిరీకరణ నిధి ద్వారా మార్కెట్ ఇంటర్‌వెన్షన్ స్కీంను కోకో రైతులకు కూడా వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. డైరెక్టర్ కే.శ్రీనివాసులు మాట్లాడుతూ కోకో రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యాన శాఖ డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కోకో రైతులు

సబ్ డీఎఫ్‌ఓపై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం: తన భర్తను తీవ్రంగా కొట్టి గాయపర్చిన కన్నాపురం రేంజ్ సబ్ డీఎఫ్‌ఓపై చర్యలు తీసుకోవాలని మడకం అనిత కోరింది. సోమవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనిత మాట్లాడుతూ ఈ నెల 10న తన భర్తను మాట్లాడాలని చెబుతూ అటవీశాఖాధికారులు ఫోన్ చేశారని, కన్నాపురం కార్యాలయానికి వెళ్లిన తన భర్తను తీవ్రంగా కొట్టి గాయపర్చారన్నారు. విషయం తెలుసుకున్న తాము అటవీశాఖ కార్యాలయానికి వెళ్లగా, వైద్యం తామే చేయిస్తామని, విషయం పెద్దది చేయవద్దని, చేస్తే కేసులు పెడతామని బెదిరించారని అనిత తెలిపింది. సబ్ డీఎఫ్‌వో, అతనికి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు, కులంతో దూషించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని అనిత కోరింది. కార్యక్రమంలో ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ మొడియం శ్రీనివాసరావు, జువ్వల బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్ ద్వారా ఫిర్యాదుకు అవకాశం

వినియోగదారుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడి వెల్లడి

కొయ్యలగూడెం: వినియోగదారుల కమిషన్‌కు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయొచ్చని వినియోగదారుల సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏఆర్‌కే హనుమంతరావు తెలిపారు. ఈ మేరకు కొయ్యలగూడెంలో ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎప్పటి నుంచో ఈ అవకాశం ఉన్నప్పటికీ వినియోగదారులు అవగాహన లేమితో సద్వినియోగం చేసుకోవటం లేదని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇటీవల హైదరాబాదులో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల వినియోగదారుల ఫోరం సమావేశంలో దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచార చేయాల్సిందిగా తీర్మానం చేసినట్లు పేర్కొన్నారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు వస్తువుల విక్రయం, నాసిరకం ఉత్పత్తులు అంటగట్టడం వంటి విషయాలు ఇక నుంచి వినియోగదారుల కమిషన్‌కు ఫిర్యాదు చేసే వెలుసుబాటు కేంద్రం కల్పించిందని వివరించారు. కేంద్ర వినియోగదారుల మంత్రిత్వ శాఖ ఇందుకోసం ×వాట్సాప్ చాట్‌బాట్‌ సేవలను తీసుకొచ్చిందని తెలిపారు. వాట్సాప్ నంబర్ 88000 01915కి మొదట హాయ్ అని టైప్ చేయాలని, అక్కడి సూచనల ఆధారంగా వివరాలు నమోదు చేస్తే జాతీయ వినియోగదారుల కమిషన్ హెల్ప్‌లైన్‌లో ఫిర్యాదు నమోదవుతుందని వివరించారు. అనంతరం కేసు పరిష్కారం కోసం వివరాలను ఆయా జిల్లా వినియోగదారుల కమిషన్‌కు పంపుతారని తెలిపారు. కేసు పరిష్కారమయ్యే వరకు అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తారని పేర్కొన్నారు. దీంతో పాటు 1800114000 లేదా 1915 నంబర్‌కు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఫిర్యాదు చేసే అవకాశాన్ని వినియోగదారులకు కల్పించారని వివరించారు.

సినీ నటుడు నితిన్ సందడి



నితిన్‌ను ఆలయ మర్యాదలతో సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: సినీ హీరో నితిన్ గుర్వాయిగూడెం మద్ది క్షేత్రాన్ని దర్శించుకున్నారు. హీరో నితిన్‌తో పాటు, మైత్రీ మూవీస్ అధినేత రవిశంకర్, దర్శకుడు వెంకి కుడుముల స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ముఖమండపం వద్ద అర్చకులు వేద ఆశీర్వాదం అందజేసి స్వామి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్‌వీ చందన, పర్యవేక్షకుడు జువ్వాది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.1.75 కోట్లు



హుండీల నగదును యంత్రాలతో లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల శ్రీవారి దేవస్థానం హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో సోమవారం అత్యంత కట్టుదిట్టమైన భద్రత నడుమ జరిగింది. ఈ లెక్కింపులో చినవెంకన్నకు విశేష ఆదాయం సమకూరింది. గడచిన 18 రోజులకు గాను నగదు రూపేణా స్వామివారికి రూ.1,75,65,133 ఆదాయం లభించినట్టు ఆలయ ఈఓ ఎస్‌వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. భక్తులు కానుకల రూపేణా సమర్పించిన 137 గ్రాముల బంగారం, 3.130 కేజీల వెండితో పాటు అధికంగా విదేశీ కరెన్సీ లభించిందన్నారు. లెక్కింపులోకి రాని రద్దయిన పాత రూ.2000, రూ.1000, రూ.500 నోట్ల రూపంలో రూ.17,500 లభించినట్టు చెప్పారు. ఈ లెక్కింపులో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని ముగ్గురికి గాయాలు

భీమవరం: భీమవరంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారని భీమవరం టూటౌన్ ఎస్సై రెహమాన్ సోమవారం చెప్పారు. పట్టణంలోని 32వ వార్డుకు చెందిన ఎం.బేబిపవన్, భార్య లక్ష్మి, మరో వ్యక్తి మోటారు సైకిల్‌పై పెదఅమిరం వెళుతుండగా అడ్డవంతెన వద్ద వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.